www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 సెప్టెంబరు 2023
5
వైఎస్‌ఆర్



మహిళా కళాశాలలో ఆనర్స్ కోర్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో 2023-24 సంవత్సరం నుంచి సైన్సులో మూడు, ఆర్ట్స్ విభాగంలో ఒక సబ్జెక్టులో నాలుగవ సంవత్సరం ఆనర్స్ కోర్సులు కళాశాల కమిషనరేట్ వారు మంజూరు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్‌లో కెమిస్ట్రీ, గణిత శాస్త్రం, జువాలజీ విభాగాలలో, ఆర్ట్స్‌లో ఎకనామిక్స్ విభాగంలో నాలుగవ సంవత్సరం ఆనర్స్ కళాశాల కమిషనరేట్ వారి ఆదేశాల మేరకు ప్రారంభం అవుతుందని తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ (2020-23 బ్యాచ్)పూర్తి చేసి 75 శాతం ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు ఈ కోర్సులలో చేరవచ్చని పేర్కొన్నారు. ఇందులో చేరి నాలుగో సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ఆయా సబ్జెక్టులలో పీజీ రెండవ సంవత్సరంలో చేరటానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

యుఎల్‌బి పోస్టులకు కసరత్తు!

జోన్-4లో 14 పోస్టుల గుర్తింపు
22 స్టాఫ్‌నర్స్ పోస్టుల నియామకం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

యుఎల్‌బి (అర్బన్ లెవల్ బ్లాక్) పోస్టుల కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆగష్టు 19, 20 తేదీల్లో జోన్-4లోని ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల పరిధిలోని 630 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులోని 220 ఎంపి హెచ్‌ఇఒ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇందులో 14 ఎంపిహెచ్‌ఇఒ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహి ంచనట్లు తెలుస్తోంది. వీటికి సెప్టెంబర్ మొదటి వార ంలో 14 యుఎల్‌బి, 22 మంది స్టాఫ్‌నర్స్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహణకు కసరత్తు ఊపందుకుంది. గత కౌన్సెలింగ్‌ను భర్తీ చేయాల్సిన ఎంపిహెచ్‌ఇఒ పోస్టులకు సీనియారిటీ, మెరిట్ ప్రాతిపదికన చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా చేపట్టనున్న యుఎల్‌బి పోస్టుల కౌన్సిలింగ్‌ను ఏప్రాతి పదికన చేపట్టనున్నారో తెలియాల్సి ఉంది. దీనిపై రీజినల్ డైరెక్టర్ అనిల్ కుమార్‌ను సంప్రదించగా యుఎల్‌బి, స్టాఫ్‌నర్స్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నమాట వాస్తవమేనని తెలిపారు.



ఆగష్టులో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో యుఎల్‌బి పోస్టుల భర్తీకి సంబంధించి అనుమతులు రాక పోవడం వల్లే కౌన్సెలింగ్ నిర్వహించలేకపోయామని పేర్కొనడం గమనార్హం. రాష్ట్రవైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల అనుమతుల ద్వారా 220 ఎంపిహెచ్‌ఇఒ పోస్టుల భర్తీ ప్రకటన విడుదల చేశారు కదా అని అడిగితే పులివెందుల వంటి కొన్నిస్థానాల నుంచి అదనపు పోస్టులు కావాలనడం ద్వారా నిర్వహించాల్సి వస్తోందనే పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆమోదం లభించే అవకాశం ఉన్న నేపథ్యంలో సెప్టెంబర్ మొదటి వార ంలో యుఎల్‌బి, స్టాఫ్‌నర్స్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వ హించనున్నట్లు పేర్కొనడం గమనార్హం.

గజదొంగల రాజ్యం నడుస్తోంది

మోడీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గజదొంగల రాజ్యం నడుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన బస్సు యాత్ర గురువారం జమ్మలమడుగుకు చేరింది. ముందుగా ఎద్దుల ఈశ్వర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలనే ఉద్దేశంతో బస్సు యాత్రను ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విచ్చలవిడిగా వైన్స్, ఇసుకను అమ్ముతూ డబ్బులు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో దొంగల ముఠా రాజ్యమేలుతుందని వాపోయారు. కడప ఉక్కు పరిశ్రమకు నాలుగు సార్లు శంకుస్థాపన చేశారని, కనీసం నాలుగు అడుగులు కూడా పడలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇసుకను అమ్ముకుంటున్నారని పేపర్లలో చదివానని తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎస్సి, ఎస్టీలకు ఇచ్చిన భూములను లాక్కోవడం సిగ్గు చేటన్నారు. అనంతరం పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ 9 సంవత్సరాలలో 109 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రయివట్ వ్యక్తులకు తాకట్టు పెడుతుందని వివరించారు. 13 మంది ప్రధాన మంత్రులు కలిసి 67 సంవత్సరాలలో రూ. 46 లక్షల కోట్లు అప్పు చేస్తే, ఈయన మాత్రం తొమ్మిది ఏళ్లలోనే 109 లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ఫీజుబిలిటీ లేదనడం సరి కాదన్నారు. నేడు రాష్ట్రంలోని బిజెపి ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని చెప్పడం, అంతలోనే కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాధ్యం కాదని పార్లమెంట్‌లో ప్రకటించడం చూస్తుంటే రెండు నాలుకల ధోరణిని గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్ర, కడప జిల్లా ప్రజలకు ఊరిస్తోందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెట్టకుండా, కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని లేకుంటే రాష్ట్రంలో రెండు పార్టీలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు ఓబులేసు, ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, ప్రసాద్, సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్, విజయ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టినందుకే దాడి : శ్రీనివాసులురెడ్డి

కడప అర్బన్ : జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేస్తున్న ఇసుక అక్రమ రవాణా గురించి ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టానని తనను కిడ్నాప్ చేసి దాడి చేశారని వైసిపి కార్యకర్త శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపాటు, నాయకుడు గంగవరం శేఖర్ రెడ్డిని కూడా చంపు తామని ఫోన్‌లో బెదిరించారన్నారు. కిడ్నాప్ లో ఎమ్మెల్యే పాత్ర ఉందని తెలిపారు. కిడ్నాప్ విషయంపై ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. తనను ఎర్రగుంట్ల రోడ్డులోని అయ్యప్ప గుడి నుంచి బలవంతంగా కార్లలో ఎత్తుకెళ్లారని తెలిపారు. దారి వెంట కొట్టుకుంటూ, తిడుతూ ఆర్‌టిపిపి రోడ్డులో రైల్వే గేట్ వరకు తీసుకెళ్లారన్నారని చెప్పారు. అనంతరం గంగవరం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మీడియా చురుగ్గా పనిచేయడం వల్లే మాలెపాడు శ్రీనివాసులరెడ్డి కిడ్నాప్‌కు కారణం అయిందన్నారు. 2019లో పార్టీ కోసం ఎన్నికల్లో వైసిపి కోసం పని చేశారని తెలిపారు. శ్రీనివాసులు రెడ్డి భార్య మెడలో బంగారు నగలు అమ్మి పార్టీ కోసం సేవ చేశాడని చెప్పారు. ఇలాంటి కార్యకర్తలు జమ్మల మడుగు నియోజక ర్గంలో చాలా మంది ఉన్నారని తెలిపారు. అలాంటి వారిని పై కిడ్నాప్ చేసి, కొట్టడం దారుణమని చెప్పారు. ఇక సర్పంచ్ రాముడిని కూడా రెండు గంటల పాటు ఇంట్లో ఎమ్మెల్యే నిర్బంధించి బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడే వారులేరన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గెలుపు కోసం పనిచేశానని, తనకు అన్యాయం జరిగిందని ప్రశ్నిస్తే వైసిపి వ్యక్తిని కాదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కిడ్నాప్ పై పోలీసులు చర్య తీసుకోవాలని, ఇలాంటి చర్యలు భవిష్యత్తులో జరగకూడదని తెలిపారు.

బిజెపి పాలనలో విలువలు దివాలా

- శాస్త్రీయ విద్యా వ్యవస్థ కోసం పోరాడాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

బిజెపి పాలనలో పాఠశాలల విలువలు దివాలా తీస్తున్నాయని, శాస్త్రీయ విద్యా వ్యవస్థ కోసం పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు జి. చంద్రశేఖర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆగస్టు 25 నుంచి 31 వరకు సంక్షేమ హాస్టల్లో, గురుకుల పాఠశాలల, కస్తూరిబాయ్ కళాశాలల సమస్యలపై, విద్యారంగా సమస్యలపై చేపట్టిన విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర ముగింపు సభ జిల్లా అధ్యక్షులు జి.సునీల్ కుమార్ అధ్యక్షతన గురువారం గాంధీ నగర్ స్కూల్‌లో నిర్వహించారు. కార్య క్రమంలో వారం రోజులపాటు యాత్రలో ఉన్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, వి.రవి, వై.రాహుల్, వై. అజయ్, మోహన్ బి.సురేష్, డి.రాజశేఖర్, ఎం.ఆర్. నాయక్, లోకేష్, ఎ.వినయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో ఉన్న పాఠశాలలలో శ్రమ పాఠశాల సూత్రాలను, విద్యాసంస్థల్ని, సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవిత సమస్యలతో సన్నిహితంగా ముడిపెట్టి పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా లక్ష్యాలను, బోధన విషయ వస్తు పద్ధతులను నిర్వహించేటప్పుడు పాఠశాలకు, జీవితానికి మధ్య, వ్యక్తికి సమిష్టికి మధ్య, వ్యక్తికి సమాజానికి మధ్య సంబంధాల వంటి ముఖ్యమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాలు ఘననీయంగా తోడ్పడాలన్నారు. మనిషి వ్యక్తిత్వపు సర్వతోముఖాభివృద్ధికి మౌలిక లక్ష్యంగా ఉండాలని, నైతికంగానూ, నైపుణ్యాన్ని సాధించే విధంగా విద్యా విధానం ఉండాలని వివరించారు. విద్యా వ్యవస్థ నిరంకుశ విధానాల వైపుగా బిజెపి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. భావిభారత ప్రయోజనాలకు ఇది ప్రమాదకరమన్నారు. ఎస్ఎఫ్.ఐ. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వారం రోజులపాటు విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర సందర్భంగా ప్రభుత్వ స్కూలు, కళాశాలలో, గురుకుల పాఠశాలలో విద్యారంగ సమస్యలున్నట్లు గుర్తించామని తెలిపారు. విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు మంచినీరు, బాత్రూములు, పౌష్టిక ఆహారం, బస్ సౌకర్యం, నాడు నేడు నిధులు మృగ్యం అన్నారు. వైవీయూ యూనివర్సిటీలో కాంపౌండ్ వాల్, లేక అసాంఘిక అల్లరి మూకలు ప్రవేశం పెరిగిందన్నారు. 69 ప్రొఫెసర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. క్యాంపస్లో ఎల్ఎల్‌బి, బిఇడి. కోర్సులు ప్రవేశపెట్టలేదన్నారు. విద్యార్థులకు నిత్యం అవసరమయ్యే ఆసుపత్రి బిల్డింగ్ నిర్మాణం, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణం 10 సంవత్సరాలుగా పూర్తి చేయకుండా అసంపూర్తిగా ఉంచారన్నారు. యూనివర్సిటీకి ఆడిటోరియం లేదన్నారు. సమస్యలపై ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ భవిష్యత్ కార్యాచరణ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం రూపొందించి విద్యార్థులతో ఉద్యమ చేపడతామన్నారు.


ఎస్ఎఫ్ఐ ముగింపు యాత్రలో సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

నేడు సచివాలయాల్లో వినతులు

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 1న సంతకాల సేకరణ, 4న కార్పొరేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ నగర కార్యదర్శి రామ మోహన్ తెలిపారు. గురువారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభ జన చట్టంలో పేర్కొన్న హామీ ప్రకారం కడప ఉక్కు పరి శ్రమ ఏర్పాటు చేయడంలో విఫలమైందని విమ ర్శించారు. ఫలితంగా చదువుకున్న నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుదల కొద్ది నెలలుగా ప్రజానికాన్ని తీవ్ర ఇబ్బం దులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వం నేరుగా యూనిట్ వారీగా ఛార్జీలను పెంచకుండా రకరకాల అదనపు బా రా లను వినియోగదారుల మీద మోపుతుందని చె ప్పారు. నరే ంద్ర మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరను రూ.450 నుంచి రూ.1150 పెంచి రూ. 200 తగ్గించినట్టు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రానున్న 5 రాష్ట్రాల ఎన్నికల దృష్టిలో పెట్టుకుని ఎన్నికల స్టంట్‌గా ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. గ్యాస్ వినియోగదారులు అందరికీ సిలిండర్ రూ.500 ఇచ్చేలా నిర్ణ యం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పరి ష్కరించాలన్నారు. వీటి పరిష్కారం కోసం కార్పొరేషన్ వద్ద జరిగే ఆందోళనలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయా లని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఎం.ఆర్. నాయక్ పాల్గొన్నారు.


చింతకుంట శివారెడ్డిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

వైజ్ఞానిక అంశాలకు నెలవు సంస్కృతం

ప్రజాశక్తి - కడప

అంతరిక్ష విజ్ఞానం, వైమానిక శాస్త్రం వంటి అనేక వైజ్ఞానిక అంశాలకు నెలవు సంస్కృత వాఙ్మయం అని సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. గురువారం కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత శాఖ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ సంస్కృత దినోత్సవం' హయగ్రీవ జయంతి, రాఖి పూర్ణిమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సంస్కృత సాహిత్య చరిత్రలో అధికావ్యమైన రామాయణం, వాల్మీకి మహర్షి జన్మ వృత్తాంతాన్ని, వేద వ్యాసుని వేద విభజన, దశో పనిషత్తులు, మహాభారతం, అష్టాదశ పురాణాలు, భాగవతం వంటి రచనల సారాన్ని విద్యార్థులకు వివరించారు. హయగ్రీవ జయంతి విశిష్టతను, హయగ్రీవ స్వామి జన్మ రహస్యాన్ని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంస్కృత వాఙ్మయం తరువాత వచ్చిన అనేక సాహిత్య చరిత్రలకు పునాదిగా ఉండేదని అన్నారు. తెలుగులో తొలి రచనగా పేర్కొంటున్న ఆంధ్ర మహాభారతానికి మూలం మహా వ్యాసుని మహాభారతమేనని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సంస్కృత శాఖాధిపతి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, హిందీ శాఖాధిపతి డాక్టర్ రమేష్, ఆంగ్ల శాఖధిపతులు సి.వి విశ్వనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతకుంట శివారెడ్డిని సత్కరించారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో 'నాంది'

ప్రజాశక్తి-కడప రూరల్

స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం 'నాంది-2023'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీర సుదర్శనరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేయడానికి తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల చైర్మన్ గంగి రెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ కనీసం ఒక ఉద్యోగం అయినా ఇవ్వాలన్నదే కళాశాల లక్ష్యమని చెప్పారు. ఇంటర్‌లో మెకానికల్ వాతావరణానికి భిన్నంగా తమ కళాశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంలో తమ కళాశాల లోని ప్రతి ఒక్కరూ కృషి చేస్తారని తల్లిదండ్రులకు మాట ఇచ్చారు. అనంతరం 2019-2023 బ్యాచ్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మొదటి సంవత్సరం విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్

వైఎస్‌ఆర్‌తో పని చేయడం అదృష్టం

-తెలంగాణ సిఎల్‌పి నాయకులు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - వేంపల్లె

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కీ.శే. వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ సిఎల్‌పి నాయకుడు మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా గురువారం సాయంత్రం మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్‌ఆర్ సమాధి వద్దకు కాంగ్రెస్ నాయకులతో కలిసి విచ్చేశారు. అనంతరం వైఎస్‌ఆర్ సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రారంభం నుంచి చివరి వరకు పాల్గొన్న వ్యక్తిగత సిబ్బంది, పాదయాత్ర ఆసాంతం వివిధ విభాగాల్లో సేవలు అందించిన నాయకులు, భద్రతా సిబ్బందితో కలిసి తిరుపతికి వెళుతూ ఇడుపులపాయలో ఉన్న వైఎస్‌ఆర్ ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. రాజశేఖర్ రెడ్డి పరిపాలన తమకు స్ఫూర్తి దాయకం అన్నారు. వైఎస్‌ఆర్ వంటి నాయకుడు దూరం కావడం మనందరి దురదృష్టకరం అన్నారు. రాబోవు రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నజీర్ అహమ్మద్, ఎపి ఎఐసిసి మెంబర్ జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోజ్జ తిరుమలేష్, ధృవకుమార్ రెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వంశీ యాదవ్, రత్నం, భువన ఏకాదశి రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

టిడిపి సంఘీభావ యాత్ర

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా యువగళం పాదయాత్రకు మద్దతుగా నగరంలో కడప నియోజకర్గ ఇన్‌ఛార్జి, వి.ఎస్. అమీర్ బాబు ఆధ్వర్యంలో భారీ సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివ కొండారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అలంకాని పల్లె లక్ష్మిరెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, సానపు రెడ్డి రవిశంకర్ రెడ్డి, ఆమూరి బాల దాసు, నక్కల శివరాం, కొండా సుబ్బయ్య, కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, బుర్రి రెడ్డయ్య యాదవ్, మురికి నాటి సునీత, మురికినాటి అంజి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరద పార్వతి యాదవ్, వరద కిరణ్ కుమార్ యాదవ్, రాయల్ కరి ముల్లా, కత్తి రవీంద్ర, రామరాజు పల్లె సుధాకర్ యాదవ్, యూనస్ భాష, కోమ్మలపాటి సుబ్బరాయుడు, అనిల్, కాజాపీర్, జిలాని బాష, జియావుద్దీన్, బిట్ట శ్రీధర్, మాసాపేట శివ, రహిమాన్, బండి జయ శేఖర్, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, కుంట శివ, భరత్, ఆదిల్, ఆరిఫ్, రాం ప్రసాద్, సురేష్, సుబ్బరాయుడు యాదవ్, వరప్రసాద్, రవి, స్వర్ణ లత, శ్రీదేవి, గంగాధర్ యాదవ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

కష్టపడి ఇష్టపడే చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని అన్నమాచార్య ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియెంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ అనేది ఉండదని, తమ నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అని విభాగాధిపతుల ప్రొఫెసర్లు డాక్టర్ శశికుమార్, శ్రీ చందన, మురళీమోహన్, మురళీకృష్ణ,రామ్మోహన్, సివి సుబ్బయ్య, వెంకటరమణ, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం అప్పరాజుపల్లి ఎంపియుపి పాఠశాలను తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రక్తహీనత వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. బయట దొరికే ఫాస్ట్ ఫుడ్,జంక్ ఫుడ్ పూర్తిగా మానేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అందులో ఉన్న విషతుల్యాలను విద్యార్థులకు వివరించారు,. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి మంచి పౌష్టికాహారంతో పాటు, సాధ్యమంతవరకు ఇంట్లోనే వండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు, కార్యక్రమంలో సిహెచ్‌ఓ సుకుమార్ సూపర్‌వైజర్ మోహన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ మైదానం ఏర్పాటుకు సహకరించండి

ప్రజావక్తి- కడప


ధ్యానచంద్రను సన్మానిస్తున్న సుభాన్‌బాషా

కడపలో రాష్ట్ర టర్ఫ్ హాకీ మైదానం ఏర్పాటు తమ వంతు సహకరించాలని ధ్యాన్ చంద్ హాకీ అకాడమీ చైర్మన్ ఎస్. సుభాన్ బాష స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యాలయంలో నూతనంగా ఎమ్‌డిగా బాధ్యతలు చేపట్టిన ఐఎ ఎస్ అధికారి హెచ్. ఎం. ధ్యానచంద్రను కోరారు. గురువారం విజయవాడలో ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా సం ఘాల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్ఎస్‌డిసి 2011 అనుగుణంగా ఎన్నికలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ద్వారా క్రీడా కారులకు, క్రీడా సంఘాలకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ విజయరామరాజు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. 9,10 వ తరగతి విద్యార్థులతో కంప్యూటర్, డిజిటల్ బోర్డ్ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం గురించి ఆరా తీశారు. నాడు నేడు నిధుల కింద కడుతున్న తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. క్రీడా మైదానంలో ఉన్న చెత్తను గమనించిన కలెక్టర్ చెత్తను వెంటనే తొలగించాలని, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు రెడ్డి మాట్లాడుతూ తరగతి గదులు అవసరం ఉన్నాయి. అదనపు గదులు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ తొమ్మిది గదులకు అనుమతి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఎంఇఒలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఎఇ సురేష్ బాబు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమలు లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కొత్తపేట సచివాలయంలో గురువారం డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ను మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రఘువయ్య, బి.నాగభూషణం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు తగిన సూచనలిచ్చారు. అనారోగ్యం ఉంటే వెంటనే వారికి చికిత్సలు అందించాలన్నారు. గ్రామంలో ఎక్కడ కూడా అపరిశుభ్రత ఉండకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభనబాబు, సిహెచ్ఓ శిరీష, ఏఎన్ఎం మెహరున్నిసా, ఆశా కార్యకర్త కాశీరత్నమ్మ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

వేల్పుల సచివాలయ సముదాయ ప్రథమ వార్షికోత్సవ సంబరాలు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో తల్లికెట్లె సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. పాఠశాల స్థాయి మూడు విభాగాల్లో జరిగిన పోటీల్లో 12 బహుమతులు తమ విద్యార్థులు అందుకున్నట్లు చెప్పారు. మండలస్థాయిలో జరిగిన చిత్ర లేఖనం పోటీల్లో శివ నరసింహ అనే విద్యార్థి మొదటి స్థానంలో నిలిచారన్నారు. పాఠశాల స్థాయి చిత్ర లేఖనంలో ప్రవీణ్, నవీన్ నాయక్, శివ నర్సింహులు మొదటి బహుమతిని పొందగా వ్యాస రచన పోటీల్లో చరణ్ తేజ, వక్తృత్వంలో మైనుద్దీన్ అనే విద్యార్థి రాణించారని అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ గురుప్రసాద్ అభినందించారు.

జూదరులు అరెస్టు : రూ.7,500 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దముడియం

అందిన సమాచారం మేరకు గురువారం పెద్దపసుపులలో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేసి, ఏడు మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7,500 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

154 కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాలకు సంబంధించి సెప్టెంబర్ నెలకు 154 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. చిన్న గురువలూరుకు 15, పెద్ద గురువలూరుకు 12, చియ్యపాడు 10, అన్నవరం 12, సోమాపురానికి 7, లక్ష్మీపేటకు 18, పల్లవోలుకు 13, ఖాదరపల్లెకు 5, వెదురూరుకు 9, అయ్యవారిపల్లెకు 3, బద్రిపల్లెకు10, ఎన్ఓ పల్లె18, చాపాడు 9, మడూరు 11, అల్లాడుపల్లె 2 పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీరికి శుక్రవారం పింఛన్ పంపిణీ ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఆర్‌టిడి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని రాజీతిరుమలదేవి డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక రూరల్ పరిధిలోని రాయల్ కౌంటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ లెక్చరర్ శేఖర్ రెడ్డి మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదివిన ప్రతి ఒక్కరూ బోధనా వృత్తిలో స్థిర పడాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోధనన్నారు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల డైరెక్టర్ గురుదేవ్ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మంచి పట్టు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అమర్నాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌విడిసిలో నోవా ఫెస్ట్ 2కె23

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బిబిఎ డిపార్ట్‌మెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో నోవా ఫెస్ట్ 2కె23 కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అర్జునవేమల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులకు విద్యతో పాటు వారి ఉద్యోగ భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణలను కళాశాలలో అనుభవ పూర్వకమైన అధ్యాపకుల ద్వారా నిర్దేశిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో బ్రిలియంట్ బ్రెయిన్, ప్రెసెంటేషన్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. బ్రిలియంట్ బ్రెయిన్‌లో సయ్యద్ నిస్సార్, సుష్మ ప్రియాంక మొదటి రెండు స్థానాలను గెలుచుకున్నారు. క్విజ్ కాంపిటీషన్‌లో శివ గణేష్, మహేష్ ప్రథమ స్థానంలో నిలవగా గుర్రప్ప, మహబూబాబాద్ మంజునాథ్ రెండవ స్థానం పొందారు. బిబిఎ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి అజ్లా అబ్దుల్ కర్యర్ మానవతం పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, కళాశాల ప్రిన్సిపల్ మస్తాన్, శరద భవాని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి, చెడుపై అవగాహన ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ (మంచి, చెడు)పై అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులు లక్ష్మీ మహేశ్వరి, పాలజీ రవికుమార్ సూచించారు. స్థానిక ఈడిగపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా జడ్జి భార్గవి ఆదేశాల మేరకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలో జరిగే సంఘటనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏది తప్పు, ఏది ఒప్పో తెలుసుకొని నడుచుకోవాలన్నారు. బాలబాలికలు అనే వ్యత్యాసం లేకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే చక్కటి విద్యాబుద్ధులను అలవర్చుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పిల్లల వయసు పెరిగేకొద్దీ వారి నడుచుకోవాల్సిన విషయాలపై చక్కటి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు న్యాయవాదులను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూతమాపురం వెంకట సుబ్బారావు, కిషోర్, సంధ్యారాణి పాల్గొన్నారు.


ఎంఇఒకు ఘన సన్మానం

చక్రాయపేట :చక్రాయపేట ఎంఇఒ ఎం.రవీంద్ర నాయక్‌ను గురువారం ఎంఆర్‌సి భవనంలో ఘనంగా సన్మానించారు. ఆయన సుండుపల్లె మండలానికి బదిలీపై వెళుతున్నారు. ఆయన స్థానంలో ఎస్ జాఫర్ సాదక్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి, వైసిపి సమన్వయకర్త ఓబుల్ రెడ్డి, ఎంపిపి మాధవి బాలకృష్ణ, జడ్‌పిటిసి శివప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, పవన్‌కుమార్ రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది, విజయకుమార్‌రెడ్డి, సుబ్బరత్న, మోహనరెడ్డి, కెవిఎన్ నాయుడు, డిసి కొండారెడ్డి, వెంకటలక్ష్మమ్మ, వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునికీకరణకు నోచని అనకుంట మురుగుకాలువ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని అనుకుంటలో కేసీ కెనాల్ చెరువు అలుగు నీరు ప్రవహించే కాలువకు సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేసే చర్యలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ కాలువలో మురుగు నీరు పారుతోంది. వర్షాకాలంలో నీరు అధికంగా వస్తుంది. అనుకుంటలో ఉన్న కాలువ గుండా నీరు ప్రవహించి పట్టణంలోని బద్వేల్ రోడ్డు నుండి సాయిబాబా క్లాత్ మార్కెట్ ద్వారా కడప రోడ్డులోనికి ఈ నీరు ప్రవహిస్తుంది. సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో కాలువ పూర్తిగా పూడికతో నిండింది. గత ఏడాది అనకుంటలో 90 సెంట్లలో ఏర్పాటు చేస్తున్న బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఈ ప్రాంతాన్ని పరిశీలించిన సందర్భంలో కాలువ నీరు సులభంగా ప్రవేశించేందుకు లైనింగ్ పనులు చేపట్టాలని ప్రజలు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువ ఆధునీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రణాలిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎలాంటి పురోగతి కనిపించలేదు. సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేస్తే వర్షపు నీరు సులభంగా ప్రవహించే అవకాశం ఉంటుంది. మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగంగా ఈ కాలువను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సిమెంట్ లైనింగ్‌కు నోచుకోని కాలువ

దూడూ బసవన్నలా రాష్ట్ర ప్రభుత్వం



ప్రొద్దుటూరులో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైసిపి అధికారంలోకొచ్చిన ఈ నాలుగున్నర ఏళ్లల్లో విద్యుత్ ఛార్జీలను 8సార్లు పెంచి ప్రజలకు షాక్ ఇచ్చిందని, కేంద్ర ప్రభుత్వానికి దూడూ బసవన్నలా వంత పాడుతోందని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని స్థానిక రాజీవ్‌సర్కిల్‌లో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న విద్యుత్ సంస్థను ప్రయివేట్‌కు అప్పజెప్పాలని స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి, ఒక్కో మీటర్ ధర రూ.40 వేలుగా నిర్ణయించి సిఎం జగన్ బంధువుకు కాంట్రాక్ట్ అప్పజెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఇదే బాదుడు కొనసాగితే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెరిగిన ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముంతాజ్‌బేగం, శేఖర్, చెన్నారెడ్డి, ఓబయ్య, శీను, మహిళా సంఘం నాయకులు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

జమ్మలమడుగు రూరల్ : పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లో గురువారం సిపిఎం అధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగులకు ఉపాధి చూపడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. తమ ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పుకు అనుమతి లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం బెదిరిస్తోందన్నారు. ఇందుకు సిఎం జగన్ మోడీ భజన చేస్తున్నారని తెలిపారు. ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా, దేశవ్యాపితంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, కరంట్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, హాజీ, హుస్సేన్ బాషా, బెన్ని పాల్గొన్నారు.



జమ్మలమడుగులో సంతకాల సేకరణ చేస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న వలి మృతదేహం, ఆస్పత్రిలో మృతి చెందిన రమీజా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని స్కార్పియో ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలో వస్తున్న ఊడగండ్ల వలి(43), ఆయన భార్య రమీజా (35) మృతి చెందారు. వివరాల మేరకు.. పులివెందుల మండలం కానేపల్లి గ్రామానికి చెందిన వలి తన కొడుకు బాల కులాయప్పకు కడుపునొప్పి రావడంతో చికిత్స కోసం తన భార్య రమీజాను తీసుకొని ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పులివెందుల శ్రీకృష్ణుని గుడి ఆలయ సమీపం శిల్పారామం రోడ్డులో వస్తున్న స్కార్పియో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఊడగండ్ల వలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య రమీజా, కుమారుడు బాల కులాయప్పకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రమీజా మృతి చెందింది. బాల కులాయప్పకు చికిత్స చేస్తున్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతిచెందడంతో వారి పిల్లలిద్దరూ అనాథలుగా మిగిలారు. విషయం తెలుసుకున్న బంధువులు ఏరియా ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

ఇటీవల ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం మృతి చెందుతున్నారు. ఇక్కడ శ్రీకృష్ణ ఆలయం, కొద్ది దూరంలోనే ఓ ప్రయివేట్ హాస్పిటల్ ఉండడంతో చుట్టుపక్కల పల్లెల వారు, బయట ప్రాంతాల వారు, ఊరి శివారులో నివాసం ఉంటున్న వారు ఎక్కువగా వస్తుంటారు. రోడ్డు దాటే సమయంలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లను, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపి నేతలపై అక్రమ కేసులు దుర్మార్గం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంబవరం ఇసుక క్వారీకి అనుమతులు లేకున్నా అక్రమంగా జేసిబిలు, టిప్పర్లు పెట్టి తరలిస్తూ టిడిపి నేతలపైనే అక్రమ కేసులు పెడతారా అని టిడిపి రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు మంగళవారం ఇసుక క్వారీ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న జమ్మలమడుగు ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకటరమణారెడ్డితోపాటు 15 మందిపై అక్రమంగా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని కాల రాయడమేనని విమర్శించారు. మంగళవారం జంబాపురం ఇసుక క్వారీలో అనధికారికంగా ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకొని టిడిపి రాష్ట్ర పిలుపు మేరకు నిరసన వ్యక్తపరిచేందుకు అక్కడికి చేరుకోగా, అక్కడే జెసిబి, టిప్పర్లు ఉంటే వాటిని పోలీసులకు అప్పగించారని, దానిపై ఎలాంటి చర్యలు చేపట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతలపై అక్రమ కేసులు పెట్టేందుకే వైసిపి వారు డ్రైవర్‌ను కొట్టినట్లు డ్రామాలాడుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మైన్స్ డిడి అంబవరం ఇసుక క్వారీకి అనుమతులు లేవని తెలియజేసినా, అక్రమ క్వారీ చేస్తున్న వైసిపి వారిపై కాకుండా టిడిపి నియోజకవర్గ అగ్ర నేతలపై కేసులు బనాయించడం ఏంటని ప్రశ్నించారు. అనుమతి లేని ఇసుక క్వారీకి నకిలీ స్లిప్పులు ఇచ్చి కోట్లు దండుకుంటుంటే వారిపై చర్యలు లేకపోగా టిడిపి నేతలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సిగ్గుచేటని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథ్‌రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మలూరు శ్రీనివాసులు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఉపాధి హామీ పనుల్లో అక్ర మాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా విజి లెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, ఎపిడి సుబ్బారెడ్డి హెచ్చరిం చారు. మండల కేంద్రం లోని ఎంపిడిఒ కార్యాల యంలో గురువారం వారు మాట్లాడుతూ మండలంలో శిలాఫలకాలు ఏర్పాటుపై పూర్తిస్థాయిలో విచారించి, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 'శిలాఫలకాల ఏర్పాటులో నిర్లక్ష్యం' అనే శీర్షికన 'ప్రజాశక్తి'లో కథనం మంగళవారం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు



విచారిస్తున్న యోగాంజనేయరెడ్డి

4న ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి - లింగాల

ఈనెల 4న లింగాల ఎంపిపి ఎన్నిక జరగనుందని ఎంపిడిఒ సురేంద్ర తెలిపారు. గతంలో ఎంపిపిగా పని చేస్తున్న అమృత వ్యక్తిగత కారణాలతో రెండు నెలల క్రితం రాజీనామా చేశారు. గతనెల 5న ఇన్‌ఛార్జి ఎంపిపిగా వెలిదండ్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 4న ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నిక నిర్వహిస్తామని ఎంపిడిఒ తెలిపారు. మండలంలోని ఎంపిటిసిలు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే 6 సూత్రాలు అమలు : పిసిసి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే పేదలకు అవసరమైన ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు పరుస్తామని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు రూ.6లక్షల వ్యవసాయ రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. పేద కుటుంబానికి నెలకు రూ.6000 ఫించన్ పథకాన్ని అమలు పరుస్తామన్నారు. విభజన రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పిస్తామన్నారు. ఫలితంగా పరిశ్రమలొచ్చి యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సమన్వయకమిటీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం శర్మ, సభ్యులు పూల నజీర్, జిలానీబాషా, సైమన్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు : బిజెపి చేతిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కీలుబొమ్మలుగా మారారని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జమ్మలమడుగు ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ, అమిత్ షా దయా దాక్షిణాల కోసం ఆ ముగ్గురు నాయకులు తెగ ఆరాటపడుతున్నారని విమర్శించారు. ఆ నాయకులు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మోడీ అమిత్ షా పాదాల చెంత తాకట్టు పెట్టారని తెలి పారు. బిజెపి రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి కోరారు. సమన్వయ కమిటీ సభ్యులు సుబ్ర హ్మణ్యం శర్మ, నజీర్, పుష్పరాజు, సుబ్బారావు, రాజేష్ , మహేష్ నాయుడు, ఉత్తన్న, సుబ్బరాయుడు, నాగార్జున పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ముద్దనూరు : క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ఎంపిడిఒ సూర్య నారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ ఆటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 3లోపు ఆయా సచివాలయాల్లో, వాలంటీర్ల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పోలీసుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న సత్యనారాయణ

నేరం జరిగిందని బాధితుడు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించకపోవడంతో అవమానం భరించలేక బాధితుడు రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడని సిపిఎం కార్య దర్శి సత్యనారాయణ ఆవే దన వ్యక్తం చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 7న రాత్రి తొమ్మిది గంటలకు అమృత్‌నగర్‌కు చెందిన అబ్దుల్ అనే యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. తనను ఐదుమంది కలిసి కొట్టారని ఒకరి చేతికున్న కడెంతో రొమ్ములపైన కొట్టగా నొప్పి తట్టుకోలేక ఉన్నానని తాలూకా పోలీస్‌స్టేషన్ కెళ్ళి ఫిర్యాదు చేయగా పోలీసులు నిర్లక్ష్యంగా ఉదయం రమ్మని చెప్పరని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా తనకు రక్షణ లేదని అవమానాన్ని భరించలేక అబ్దుల్ నేరుగా యర్రగుంట్లకు పోయి రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని అబ్దుల్ తల్లి గత నెల 20న ఫిర్యాదు చేశారన్నారు. అయినా పోలీసులు నిర్లక్ష్యం వీడలేదన్నారు. అబ్దుల్ తల్లి దాడిచేసిన వారి ఆచూకీ తెలుపగా వారిని తీసుకెళ్ళి ఏం చేశారో కూడా చెప్పలేదన్నారు. అమృత్‌నగర్‌లో పలు అప్రజాస్వామిక సంఘటనలు జరుగుతున్నా పోలీసుల చర్యలు శూన్యమని విమర్శించారు. ఈ సంవత్సర కాలంలో నలుగురు యువకులు మృతి చెందారన్నారు. ఇవి ఆత్మహత్యలుగా చిత్రీకరింపబడ్డాయన్నారు. జిల్లా పోలీస్ అధికారులు స్పందించాలని, లేకపోతే వారంలోపు తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. సమావేశంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ కార్యదర్శి వెంకట సుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, ఆటోయూనియన్ కార్యదర్శి శేఖర్, సుబ్బయ్య, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

151 కంటే ఎక్కువ స్థానాలు వైసిపి గెలుస్తుంది

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

2024 ఎన్నికల్లో 151 కంటే ఎక్కువ స్థానాలు వైసిపి గెలుస్తుందని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి తెలిపారు. రూ.కోటి నిధులతో నాను బాలపల్లి రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూసిందన్నారు. రెండు ఓట్లు వేసిన ఎర్రబల్లె పంచాయతీని సైతం అభివృద్ధి చేశామన్నారు. దాదాపు 25ఏళ్లుగా మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. నేడు సిఎం జగన్మోహన్‌రెడ్డి మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. దాదాపు 15 రోడ్ల పనులను శరవేగంగా చేస్తున్నామన్నారు. రూ.19 కోట్ల నిధులతో పనులను చేస్తున్నామన్నారు. రూ.1.30కోట్లతో ఇందిరమ్మ కాలనీలో సిసి రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధి చియ్యపాడు గ్రామంలో గురువారం సర్పంచు శివప్రసాద్ అధ్యక్షతన గురువారం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతోందని పరిష్కరించాలని కోరారు. గ్రామంలో పశు వైద్య సిబ్బంది లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో, పంట పొలాల్లో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని, వాటిని సరిచేయాలని సభ్యులు కోరారు. గ్రామంలో డ్రయినేజీ సమస్యకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలన్నారు. నూతన లబ్ధిదారులందరికీ పింఛన్ అందలేదని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. సభ్యులు సూచించిన సమస్యలపై సర్పంచు, పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తిందన్నారు. ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీటి కొరత లేకుండా చూస్తున్నామని తెలిపారు. సభ్యులు సూచించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపిటిసి-1 ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, చియ్యపాడు-2 ఎంపిటిసి సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచు ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

డిసిసి బ్యాంకులో విరివిగా రుణాలు

సిఇఒ రాజేంద్ర కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

కడప డిసిసి బ్యాంకుల్లో ప్రజలకు, రైతులకు అన్ని రకాల రుణాలను విరివిగా ఇస్తున్నట్లు ఆ బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్ చెప్పారు. గురువారం వేంపల్లెలోని డిసిసి బ్యాంకును ఆయన తనిఖీ చేశారు. అలాగే బ్యాంకులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇతర కమర్షియల్ బ్యాంకులాగే కడప డిసిసి బ్యాంకులు కూడా పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మంచి లాభాల్లో ఉన్నట్లు చెప్పారు. ఇతర దేశాల్లో చదువుకొనే విద్యార్థులకు రుణాలతోపాటు బంగారు, ఇంటి నిర్మాణ రుణాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు, ప్రజలు, డ్వాక్రా మహిళలు తీసుకొంటున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రుణాలు తీసుకొనేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. వ్యవసాయ రుణాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. డిపాజిట్లు పెరుగుతున్నట్లు చెప్పారు. వేంపల్లెలోని డిసిసి బ్యాంకును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. వేంపల్లె డిసిసి బ్యాంకు మేనేజర్ బాలాజీ రాజు, సొసైటీ సిఇఓ రామిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగ రాజు, మస్తాన్ పాల్గొ న్నారు.

రామకృష్ణకు ఘన స్వాగతం

ఎర్రగుంట్ల : సిపిఐ చేపట్టిన 'సిపిఐ ప్రచార జాతా-బస్సు యాత్ర' గురువారం ఎర్రగుంట్ల చేరుకుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసుకు స్థానిక సిపిఐ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, నాయకులు రాధాకృష్ణ, భవాని శంకర్, గుర్రప్ప, శరత్, లీలాకృష్ణ పాల్గొన్నారు.